www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | బుధ వారం, 21 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోనుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-215 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## బండి సంజయ్ అసలు మనిషా..పశువా

### డ్రగ్స్ ఆరోపణలపై ఘాటుగా స్పందిస్తూ సవాల్ విసిరిన కెటిఆర్



కరీంనగర్‌కు ఏంచేశాని అడిగాతే పెడబొబ్బలా

రక్తం, వెంట్రుకలు, గోర్ల నమూనాలు ఇస్తా

తప్పని తేలితే కరీంనగర్ కమాన్ వద్ద చెప్పుతో కొట్టుకోవాలి

**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 20 (సమ సమాజం):** బండి సంజయ్ అసలు మనిషా..పశువా..వానికేమైనా తెలివుందా...గావుకేకలు..పెడబొబ్బలు తప్ప కరీంనగర్‌కు ఏం చేశాంటే సమాధానం చెప్పడు అని అంటూ మంత్రి కెటిఆర్ ఘాటు విమర్శలు చేశారు. తనపై పదేపదే డ్రగ్స్ ఆరోపణలు చేస్తున్న బండి సంజయ్‌కు సవాల్ విసిరారు. టెస్ట్ కోసం తన రక్తం, గోర్లు, చర్మం కూడా ఇస్తా.. కిడ్నీ కూడా ఇస్తా ..టెస్ట్ చేయించు కోవచ్చు..తాను సచ్చీలుడిగా బయటకు వచ్చాక..కరీంనగర్ కమాన్ వద్ద బండి సంజయ్ తనచెప్పుతోనే కొట్టుకోవాలన్నారు. కరీంనగర్ అభివృద్ధికి ఏం చేశారని అడిగితే చెప్పకుండా గావు కేకలుపెడుతున్నాడని మండిపడ్డారు. ఆయన మనిషా పశువా అంటూ ఘాటు విమర్శలు చేశారు. సిరిసిల్ల జిల్లా పర్యటనలో మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను తిడితే ఓట్లు రాలవు.. దమ్ముంటే కేంద్రం నుంచి నిధులు తీసుకురా అని బండి సంజయ్‌కు మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. మా కంటే రెండు మంచి పనులు ఎక్కువ చేసి ప్రజల మనసు గెలుచుకోండి. పొద్దున లేస్తే బూతులు మాట్లాడటం 3లో



సభకు క్షమాపణ చెప్పాలని బిజెపి డిమాండ్

సభ బయట చేసిన వ్యాఖ్యలపై స్పందించనన్న ఖర్గే

## ఖర్గే వ్యాఖ్యలపై రాజ్యసభలో దుమారం

**జయపుర, డిసెంబర్ 20 (సమ సమాజం):** రాహుల్ జోడో యాత్రలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై రాజ్యసభలో దుమారం రేగింది. ఖర్గే వ్యాఖ్యలపై ఇవాళ రాజ్యసభలో తీవ్ర దుమారం చెలరేగింది. ఒక రాజకీయ పార్టీకి జాతీయ అధ్యక్షుడై ఉండి నోటికొచ్చిన వ్యాఖ్యలు చేసిన ఖర్గే తమకు క్షమాపణ చెప్పాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. కేంద్రమంత్రులు పీయూష్ గోయెల్, కిరణ్ రిజుజు, ప్రహ్లాద్ జోషి ఖర్గే వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా ఖర్గే మాత్రం అదరలేదు, బెదరలేదు. బీజేపీ నేతలు ప్రస్తావిస్తున్న వ్యాఖ్యలు తాను పార్లమెంట్‌లో చేయలేదని, పార్లమెంట్ బయట తాను చేసిన వ్యాఖ్యలపై సభలో చర్చించాల్సిన అవసరం లేదని అన్నారు. బీజేపీ నేతలకు ప్రతి దానికి క్షమాపణ అడగటం అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. తాను సభ బయట చేసిన వ్యాఖ్యలను సభలో కూడా చేశానంటే వాళ్లు (బీజేపీ నేతలు) మరింత ఇబ్బందుల్లో పడాల్సి వస్తుందని రాజ్యసభ ఛైర్మన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను చేసిన వ్యాఖ్యల్లో తప్పేలేదని, ఇప్పటికీ తాను ఆ వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నానని ఖర్గే చెప్పారు. 3లో

## పోలీస్ పరుగు పందెంలో ఓడిన రాజేందర్

### చికిత్స పొందుతూ మృతి ● గుండెపోటు కారణమన్న కమిషనర్



**వరంగల్, డిసెంబర్ 20 (సమ సమాజం):** పోలీస్ రిక్రూట్ మెంట్ లో భాగంగా రన్నింగ్ రేస్ లో పాల్గొన్న అనంతరం అస్వస్థతకు గురై చనిపోయిన కానిస్టేబుల్ అభ్యర్థి రాజేందర్ మృతిపై పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. కార్డియాక్ అరెస్ట్ అవడం వల్లే కానిస్టేబుల్ అభ్యర్థి రాజేందర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని తేలిందని చెప్పారు. వెంటనే ఆస్పత్రికి తరలించి చకిత్స అందించినా ఫలితం దక్కలేద న్నారు. 3లో

### కనీసం టాయ్‌లెట్స్ కూడా లేవు:

## కెఏ పాల్

**హైదరాబాద్, డిసెంబర్ 20 (సమ సమాజం):** ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తారు కానీ..కళాశాలల్లో విద్యార్థులకు టాయిలెట్స్, కనీస సౌకర్యాలు కల్పించలేరా అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. ఆయన సరూర్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేఏ పాల్.. సరూర్ నగర్ జూనియర్ కళాశాలలో సుమారు 800 మంది విద్యార్థులు చదవుతున్నారని.. కళాశాలలో కేవలం ఒకే ఒక్క గర్ల్స్ టాయిలెట్ తో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్నామని తెలిపారు. విషయం తెలుసుకొని ఈ రోజు కళాశాలను పరిశీలించామన్నారు. కళాశాలలో నెలకొన్న దుస్థితిపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణీలపై పాల్ మండిపడ్డారు. వారం రోజులలో టాయిలెట్స్ నిర్మాణం చేయకపోతే తన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తానని పాల్ వెల్లడించారు.

## క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లు

### పరిశీలించిన మంత్రులు

**హైదరాబాద్, డిసెంబర్ 20 (సమ సమాజం):** క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు ప్రభుత్వం బుధవారం విందు ఇవ్వనున్నది. ఈ మేరకు ఏర్పాట్లను మంత్రులు కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మితో పాటు నగర ఎమ్మెల్యేలు పరిశీలించారు. విందుకు సీఎం కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ నేతృత్వంలో క్రిస్మస్ వేడుకలు అధికారికంగా సీఎం కేసీఆర్ జరుపుతున్నారన్నారు. క్రైస్తవులతో కలిసి విందులో పాల్గొంటారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చే విందులో దాదాపు 12వేల మంది పాల్గొంటారని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. విందును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విందుకు హాజరయ్యే అతిథులంతా 5 గంటల వరకు చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురికి అవార్డులు అందజేయనున్నట్లు వివరించారు.

## తెలంగాణ కాంగ్రెస్‌లో సంక్షోభం

### దిగ్విజయ్‌కు చక్కదిద్దే బాధత్యలు?



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20 (సమ సమాజం):** తెలంగాణ కాంగ్రెస్‌లో సంక్షోభం మరింత ముదిరింది. ఒకవైపు సీనియర్ల వివాదం.. మరోవైపు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన కీలక నేతల రాజీనామాల పర్వం.. వెరసి పెను సంక్షోభానికి దారి తీసింది. తమకు పదవులు ఇవ్వడంతో సీనియర్ నేతలంతా తీవ్ర అసంతృప్తికి లోనయ్యారని.. కాబట్టి తమ పదవులను వారికి కట్టబెట్టాలని రాజీనామా చేసిన 12 మంది నేతలు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్‌కు లేఖ 3లో

## సిఎం కెసిఆర్‌తో పంజాబి సిఎం మాన్ భేటీ

### భవిష్యత్ రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం



**హైదరాబాద్, డిసెంబర్ 20 (సమ సమాజం):** ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో పంజాబ్ సీఎం భగవంత్ మాన్ భేటీ అయ్యారు. పలు కార్యక్రమాల కోసం మంగళవారం హైదరాబాద్ కు వచ్చిన భగవంత్ మాన్ రెండు రాష్ట్రాల పరిస్థితులు, దేశ రాజకీయాలపై ప్రగతి భవన్‌లో చర్చించినట్లు సమాచారం. టీఆర్ఎస్ పార్టీ పేరును బీఆర్ఎస్ గా మార్చిన తర్వాత దేశ వ్యాప్తంగా దూకుడు పెంచాలని భావిస్తున్న కేసీఆర్ పంజాబ్ ముఖ్యమంత్రితో పలు విషయాలను చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో ఉన్న ఎంపీలు, జాతీయ స్థాయిలో సంబంధాలున్న వారి సూచనల మేరకు బీజేపీకి వ్యతిరేకంగా చేపట్టాల్సిన కార్యక్రమాలకు సన్నాహాలు చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల కథనం. భారత రాష్ట్ర సమితి పార్టీ కేంద్ర కార్యాలయాన్ని కేసీఆర్ ఢిల్లీలో ఇటీవలే ప్రారంభించిన సంగతి తెలిసిందే. నాటి నుంచి పలు రాష్ట్రాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు, రైతు సంఘాల నేతలు 3లో

## విద్వేష మార్కెట్లో ప్రేమను పంచుతున్నా

### బిజెపి విమర్శలను తిప్పికొట్టిన రాహుల్

### తనయాత్రపై విషం తగదని హితవు

**జయపుర, డిసెంబర్ 20 (సమ సమాజం):** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర రాజస్థాన్‌లో సాగుతోంది. తమిళనాడులోని కన్యాకుమారిలో మొదలైన భారత్ జోడో యాత్ర కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మీదుగా రాజస్థాన్‌కు చేరింది. ప్రస్తుతం రాజస్థాన్‌లో రాహుల్ భారత్ జోడో యాత్ర కొనసాగుతున్నది. కశ్మీర్‌లో ఈ యాత్ర ముగియనుంది. ఈ క్రమంలో రాహుల్‌గాంధీ పాదయాత్రపై కొందరు బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. రాహుల్‌గాంధీ యాత్ర ఎందుకు చేస్తున్నట్టో అని ఎద్దేవా చేస్తున్నారు. పాదయాత్రలతో ఓట్లు రాలవని ఎగతాళిగా మాట్లాడుతున్నారు. దాంతో గత రాత్రి రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో సమావేశం అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ వ్యాఖ్యల గురించి ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు రాహుల్‌గాంధీ సెటైరికల్‌గా సమాధానం



3లో

## పార్లమెంట్ ఆవరణలో మిల్లెట్ ఓన్లీ లంచ్

### ట్వీట్ చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20 (ఆర్ఎన్ఎ):** భారత పార్లమెంట్ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం వినూత్న కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో 'మిల్లెట్ ఓన్లీ లంచ్' కార్యక్రమాన్ని కేంద్రం ఏర్పాటు చేసింది.




3లో

## చైనాతో సరిహద్దుల్లో గట్టి నిఘా

### బాలిస్టిక్ క్షిపణిని మొహరించే సన్నాహాలు ● సైనిక కార్యకలాపాలపై మీడియా కథనాలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20 (సమ సమాజం):** చైనాతో కొనసాగుతున్న సరిహద్దు వివాదం మధ్య భారత సైన్యం వ్యూహాత్మక కార్యకలాపాల కోసం తొలిసారిగా బాలిస్టిక్ క్షిపణిని చేర్చబోతున్నది. ఎల్ఏసీపై ప్రళయ్ బాలిస్టిక్ క్షిపణిని మోహరించాలని సైన్యం నిర్ణయించినట్లు పలు మీడియా సంస్థలు వెల్లడించాయి. ఈ క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల వరకు తన లక్ష్యాన్ని టార్గెట్ చేయగలదు. ఈ క్షిపణిని 2021 డిసెంబర్‌లో వరుసగా రెండు రోజుల్లో రెండుసార్లు విజయవంతంగా 3లో

## నేటి నుంచే గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్స్

### కామారెడ్డి నుంచి ప్రారంభించనున్న మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, డిసెంబర్ 20 (సమ సమాజం):** మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. గర్భిణుల కోసం కేసీఆర్ కిట్లను అందించనున్నది. పథకాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం నుంచి గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందజేయనుండగా.. కామారెడ్డి నుంచి



3లో

## సంపాదకీయం

### దేశాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్న పాలకులు !

దేశంమే కాదు..రాష్ట్రాలు కూడా అప్పులు ఊబిలో కూరుకుపోతున్నాయి. రాష్ట్రాలను కంట్రోల్ చేయాల్సిన కేంద్రం కూడా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తూ దేశాన్ని అగాథంలోకి నెడుతుంది. రాష్ట్రాలను అజమా యిషీ చేయాల్సిన కేంద్రం చేతులెత్తేస్తోంది. కేంద్రం కూడా అదే దారిలో నడిస్తే మరి ప్రశ్నించే వారు ఎవ్వ రన్నదే ఇప్పుడు ప్రశ్న. ఇలా ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్నా దేశంలో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ధరలు దిగి రావడం లేదు. జిఎస్టీ వాతలు తగ్గడం లేదు. గ్యాస్, పెట్రో ధరలు తగ్గలేదు. నిరుద్యోగం పెరుగుతూనే ఉంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మేస్తున్నారు. అయినా ఈ డబ్బు ఎక్కడికి పోతుందన్నది తెలియాలి. దీనిపై సమగ్ర చర్చ చేయాలి. రాష్ట్రాలు చేస్తున్న అప్పులతో పాటు..కేంద్రం చేస్తున్న అప్పులపైనా చర్చించాలి. ఇలా పాలకులు ప్రజలను మభ్యపెడుతూ పోతుంటే నష్టపోయేది ప్రజలే. అందువల్ల దీనిపై పార్లమెంట్ ప్రత్యేకంగా చర్చించాలి. అధికారం అప్పగించాం కదా అని ఇష్టారీతిన అప్పులు చేస్తే కట్టేది ఎవరు. జిఎస్టీ వసూళ్లు లక్షా40 వేల కోట్లకుచేరినా అప్పులు చేయాల్సిన అవసరం ఎందుకు వస్తోంది. కేంద్రంలో మోదీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ అప్పులు పెరిగిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అంతర్గత, విదేశీ రుణాలు కలిపి 2014-15లో రూ.62.44 లక్షల కోట్లుండగా.. 2021-22లో తాత్కాలిక అంచనాల ప్రకారం రూ.138.87 లక్షల కోట్లకు చేరుకున్నాయి. లోక్‌సభలో సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి వివరాలు వెల్లడించారు. 2014-15లో అంతర్గత అప్పులు రూ.47.38 లక్షల కోట్లు, విదేశీ రుణాలు రూ.3.66 లక్షల కోట్లు,ఇతర అప్పులు 11,44 లక్షల కోట్లు ఉండగా, ఇవి ఏటా పెరుగుతూనే ఉన్నాయి. 2021-22 తాత్కాలిక లెక్కల ప్రకారం కేంద్ర ప్రభుత్వ అంతర్గత అప్పు రూ.114.62 లక్షల కోట్లు, విదేశీ రుణాలు రూ.6.59 లక్షల కోట్లు, ఇతర బాకీలు రూ.17.67 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇక తెలంగాణలో 2018లో అప్పులు రూ.1,60,296.40 కోట్లు కాగా.. 2019లో రూ.1,90,202.70 కోట్లు, 2020లో రూ.2,25,418 కోట్లు, 2021లో రూ.2,67,530 కోట్లు, 2022లో రూ.3,12,191 కోట్లకు చేరుకున్నాయి. జీఎస్‌డీపీ ప్రకారం తెలంగాణ అప్పులు 2016లో 15.7 శాతం ఉండగా 2022 మార్చి నెలాఖరుకు 27.4 శాతానికి చేరుకున్నాయి. ఎపిలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆ రాష్ట్ర అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. 2019లో ఏపీ రుణాలు రూ.2,64,451 కోట్లు కాగా 2020లో రూ.3,07,671.50 కోట్లు, 2021లో రూ.3,60,333.40 కోట్లు, 2022లో రూ.3.98,903.60 కోట్లకు చేరుకున్నాయి. జీఎస్డీపీ ప్రకారం చూసినా 2019లో అప్పుల శాతం 30.4, 2020లో 31.7, 2021లో 36.5, 2022 మార్చి నెలాఖరుకు 37.6 శాతానికి పెరిగాయని కేంద్రమంత్రి చెప్పారు. నిజానికి ఇంతగా అప్పులు చేసి ఏం చేస్తున్నారన్నదానిపైనా వివరణ రావాల్సి ఉంది. ప్రజలు కూడా పాలకులను అప్పులపై నిలదీయాలి. అలాగే అప్పులపై అజమాయిషీ ఉండాల్సిందే కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేంద్ర, రాష్ట్రాలు అన్న తేడా లేకుండా అప్పులు పెరుగుతున్నాయి. మరోవైపు ఆర్థికంగా రాష్ట్రాలను బలహీనపరిచి వాటి అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇవ్వాల్సిన వాటాను తగ్గిస్తున్నారు. సామాన్యుల పై అదనపు పన్నులు మోపుతూ ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తీస్తున్నారు. సెస్సుల రూపంలో సింహభాగం నిధులను కేంద్ర ఖజానాకు మళ్లించుకుపోతున్నారు. సెస్సుల పేరుతో మోదీ బాదుడు గత ఎనిమిదేండ్లలో ఏకంగా 4 రెట్లు పెరిగింది. 2013-14 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2021-22లో సెస్సుల మోత 18 శాతానికి ఎకబాకింది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్రమే లోక్‌సభ సాక్షిగా అంగీకరించింది. 2013-14లో వచ్చిన

మొత్తం రూ.10.14 లక్షల కోట్ల రాబడిలో సెస్సు 7.3 శాతంగా.. 2021-22 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రూ.16.33 లక్షల కోట్ల రాబడిలో సెస్సు 18.2 శాతంగా ఉన్నట్టు ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ఇకపోతే గత ఎనిమిదేండ్లలో మోదీ సర్కార్ పెట్రోల్, డీజిల్‌పై సెస్సులను అడ్డగోలుగా పెంచి రాష్ట్రాలకు తీరని అన్యాయం చేసింది. 2014-21 మధ్య కాలంలో పెట్రోల్‌పై సెస్సును 6 రెట్లు, డీజిల్‌పై ఐదున్నర రెట్లు పెంచింది. తద్వారా రాష్ట్రాల వాటాలను కాజేసి కేంద్ర ఖజానాకు తరలించు కుపోయింది. ఇటీవల కేంద్రం లీటర్ పెట్రోల్‌పై రూ.2.50, డీజిల్‌పై రూ.4 చొప్పున పన్ను తగ్గించినప్పటికీ ఆ మేరకు సెస్సును పెంచింది. దీంతో కేంద్రం కొత్తగా నిర్ణయించిన 41శాతం వాటా ప్రకారం రాష్ట్రాలకు లీటర్ పెట్రోల్‌పై రూ.1.03, డీజిల్‌పై రూ.1.64 చొప్పున ఆదాయం తగ్గింది. ఇదేవిధంగా ఇతర పన్నుల నుంచి రాష్ట్రాలకు రావాల్సిన వాటాను కూడా కేంద్రం కొల్లగొడుతున్నది. 2017-2020 మధ్య కాలంలో కేంద్రం ఎక్సైజ్ పన్నులో పెట్రోల్‌పై సెస్, సర్ ఛార్జీలను 150శాతం, డీజిల్‌పై 350శాతం పెంచింది. సెస్సుల రూపంలో మోదీ సర్కార్ రోజూ సగటున రూ.813 కోట్లు దోచుకొంటున్నది. 2013-14 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.22,236 కోట్లుగా ఉన్న ప్రైమరీ ఎడ్యుకేషన్ సెస్సును 2020-21 నాటికి రూ.62 వేల కోట్లకు.. సెకండరీ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్సును రూ.11,266 కోట్ల నుంచి రూ.35,821 కోట్లకు పెంచింది. ఇదే సమయంలో పెట్రోల్‌పై సెస్సును రూ.4,712 కోట్ల నుంచి రూ.25,895 కోట్లకు.. డీజిల్‌పై సెస్సును రూ.15,765 కోట్ల నుంచి రూ.85,289 కోట్లకు పెంచింది. ఇలా అన్ని సెస్సులు కలిపి గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రానికి అదనంగా రూ.2,96,884 కోట్ల ఆదాయం సమకూరింది. ఇదంతా రాష్ట్రాలకు దక్కకుండా తరలించుకు పోయిన సొమ్మేనని గుర్తించాలి. ప్రజలు చెల్లిస్తున్న అన్ని పన్నులకు అదనంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న ప్రత్యేక పన్నునే సెస్ అంటారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పెట్రోలియం, రహదారులు, మౌలిక సదుపాయాలు, ఎగుమతులు తదితర రంగాల్లో కేంద్రం ఇలా సెస్ వసూలు చేస్తున్నది. సెస్సును ఏ రంగంలో వసూలు చేస్తే ఆ మొత్తాన్ని ఆ రంగం అభివృద్ధికే వెచ్చించాలి. ఇతర రంగాలకు బదిలీ చేయరాదు. దీనికి భిన్నంగా మోదీ సర్కారు సెస్సుల రూపంలో వసూలు చేస్తున్న నిధులన్నీ పక్కదారి పట్టిస్తున్నది. పెట్రోల్, డీజిల్‌పై విధించిన సెస్‌తో చమురు పరిశ్రమలను అభివృద్ధి చేయడం లేదు. కేంద్రం విధించే సెస్సుల్లో రాష్ట్రాలకు వాటా ఉండదు. ఆ సొమ్మంతా కేంద్ర ఖాజానాకే చేరుతుంది. పన్నుల రూపంలో కేంద్రానికి వచ్చే రాబడిలోనే రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాలకు నిధులు ఎగ్గొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం క్రమంగా సెస్సులను పెంచుతున్నది. ఇంతగా ఆదాయం సమకూరుతున్నా కేంద్రంలో అప్పులు తగ్గడం లేదు. ఈ నిధులన్నీ ఏమవుతున్నాయో తేలాల్సి ఉంది. అలాగే రాష్ట్రాలు కూడా ఉచిత పథకాల పేరుతో చేస్తున్న పందేరాలను కూడా నిలదీయా ల్సిందే. ఇలా ఎంతకాలం సాగిస్తారన్నది కూడా ముఖ్యమే. మొత్తంగా కేంద్ర, రాష్ట్రాలు ఉమ్మడిగా దేశ ఖజానాను లూటీ చేస్తున్నాయి. ఈ విధానం ఇలాగే సాగితే ఆర్థిక సంక్షోభం ముదరగలదు. ప్రజలు నిలదీసి, ప్రశ్నించే అలవాటు చేసుకుంటేనే మంచిది.

**పృథ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# ప్రజల ఆశిస్సులే కెసిఆర్‌కు శ్రీరామరక్ష



## విపక్షాలకు విమర్శలతోనే సరిపోతోంది ● అభివృద్ధి పట్టని వారి మాటలు పట్టించుకోం ● వేములవాడలో పలు అభివృద్ధి పనులకు కెటిఆర్ శ్రీకారం

**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్20(సమ సమాజం):** ప్రతిపక్షాలు పొద్దున లేస్తే కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాయని, వారికి రాష్ట్రంలో అభివృద్ధి పట్టదని ంత్రి కెటిఆర్ మండిపడ్డారు. వారు శాపనార్థాలు పెడితే.. మీరే కాపాడాలి. మీ ఆశీస్సులు ఉంటే.. కేసీఆర్‌ను ఎవరూ ఏమీ చేయలేరని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని రుద్రంగిలో రూ.3 కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మించిన కేజీబీవీని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. వేములవాడ ఎమ్మెల్యే రమేష్ బాబు నేతృత్వంలో ఈ నియోజకవర్గం బ్రహ్మాండంగా అభివృద్ధి బాటలో ముందుకు పోతుందన్నారు. రుద్రంగి ప్రాంతం ఒకనాడు తీవ్రవాదానికి చిరునామాగా ఉండేదని, స్వరాష్ట్రం వచ్చాక రుద్రంగి గ్రామం ఈ రోజు మండల కేంద్రంగా మారడమే కాకుండా అభివృద్ధిలో కూడా ముందు ఉందన్నారు. రుద్రంగిలో కావలసిన మౌలిక వసతి సదుపాయాలను వెంటనే సమకూరుస్తూ కలెక్టర్‌ను నిధులు మంజూరు చేయాలని ఆదేశిస్తున్నానని తెలిపారు. సంక్రాంతి తర్వాత తాను ఎమ్మెల్యేతో వచ్చి అభివృద్ధి పనుల్లో పాలుపంచుకుంటానని పేర్కొన్నారు. బండ మీది బడికి అవసరమైన మౌలిక వసతులు కూడా కల్పించే విధంగా ఆదేశాలు ఇస్తున్నానని తెలిపారు. ఆసరా పెన్షన్లు, రైతులకు రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఇతర రాష్ట్రాల్లో అమలు కావడం లేదు. ఈ పథకాల అమలును చూసి మహారాష్ట్రలోని 14 గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు తమను తెలంగాణలో కలుపుకోవాలని సీఎం కేసీఆర్‌ను కోరుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అవతల ఉన్న కర్ణాటకలోని రాయిచూర్ ప్రజలు కూడా తెలంగాణలో కలపాలని కోరుతున్నారు. అక్కడి ఎమ్మెల్యే.. కర్ణాటక మంత్రి ముందే మమ్మల్ని కూడా తెలంగాణలో కలుపుకోమని అడుగుతున్నారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో 2014లో పెన్షన్లు 26 లక్షల మందికి వస్తే.. ఇప్పుడు రూ. 2 వేల పెన్షన్ 46 లక్షలు మందికి వస్తుందని తెలిపారు. గతంలో రూ. 65 వేల కోట్లు 66 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద ఇచ్చాం. ఇప్పుడు ఈ నెల 28 నుంచి రూ. 7600 కోట్లు మళ్లీ రైతుబంధు కింద ఇవ్వబోతున్నామని తెలిపారు. ఇంటింటికి తాగునీరు అందిస్తూ ఆడపిల్లలకు కష్టం లేకుండా చేశాం. చాతనైతే దమ్ముంటే మా కంటే రెండు మంచి పనులు ఎక్కువ చేసి ప్రజల మనసులు గెలుచుకోవాలని ప్రతిపక్షాలకు కేటీఆర్ సూచించారు. మంత్రి కేటీఆర్ వేములవాడ నియోజకవర్గంలో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుతో కలిసి మంత్రి కేటీఆర్ రూ. 72 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రూ. 20 కోట్లతో చేపట్టనున్న పట్టణ రహదారులు, స్టేడియం, సినారె కళామందిరం పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ. 52 కోట్లతో రహదారుల పునరుద్ధరణ పనుల శిలాఫలాకాన్ని ఆవిష్కరిం చారు. ఆ తర్వాత రుద్రంగిలో 3.50 కోట్లతో నిర్మించిన కస్తూర్బా స్కూల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో పరిశ్రమల మూత

### కార్పోరేట్లకు దోచిపెట్టడంతో బ్యాంకులపై భారం ● నిరుద్యోగం పెరుగుతున్నా పట్టించుకోని మోడీ సర్కార్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20 (సమ సమాజం):** అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మభ్యపెట్టిన మోడీ ఆ ఊసే ఎత్తడం లేదు. స్వయం ఉపాధి పేరుతో నిరుద్యోగులను మభ్యపెడుతున్నారు. గత ఎనిమిదేళ్లలో.. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా కార్మిక వ్యతిరేక విధానాలతో వేలాది పరిశ్రమలు మూతపడడానికి కారణం అయ్యారు. ఈ కారణంగా కనసీం 6 కోట్ల మందికి ఉపాధి పోయిందని అంచనా. అన్ని సంస్థలను ప్రైవేటుకు అప్పగించే పనిలో వేగం పెంచారు. బిజెపి ప్రభుత్వ అనాలోచిత, ఏకపక్ష విధానాలు రోజు రోజుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పెరుగుతున్న అధిక భారాలు, పన్నులు, నిరుద్యోగం, నూతన విద్యావిధానం, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, రాజ్యాంగ వ్యవస్థల్లో అనుచిత జోక్యం, రక్షణ రంగంలో ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైల్వేరంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పుతున్నారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో విదేశీ కంపెనీలకు అమ్మివేసే ప్రయత్నం చేస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక, దిగుబడిలేక ఎంతో మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కరోనా వైరస్ కష్టకాలంలో ఉపాధిలేక వేలాదిమంది ఆకలితో అలమటించారు. ఆసుపత్రులకు డబ్బులు కట్టలేక ఆస్తులు అమ్ముకున్నారు. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆనాటి పరిస్థితులను చూసి చలించిన ఎందరో వారిని దగ్గరికి తీసి, వారి ఆకలిని తీర్చి వారిని వారి గమ్యస్థలాలకు చేర్చే ప్రయత్నం చేశాయి. కానీ ప్రభుత్వం మాత్రం వారినిగాలికొదిలేసింది. మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా అనుకూల రాజకీయాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ విదేశీ కార్పొరేట్లకు వివిధ రకాల రాయితీలు, కానుకలు సమర్పిస్తూ వారిని మరింత సంపన్నవంతం చేయడం దారుణం. భారత రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం గడచిన ఐదేళ్లలో షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులు రూ.10,09,510 కోట్ల రుణాలను మాఫీ చేశాయని కేంద్రమంత్రి తెలిపారు. అంటే సగటున ఏడాదికి రెండు లక్షల కోట్ల రూపాయల రుణాలు సంపన్నులకు రద్దయాయన్నది గుర్తించాలి. ఇందులో దాదాపు సగం సార్వత్రిక ఎన్నికల సమయంలో అంటే 2018-19, 2019-20 సంవత్సరాల్లోనే 4,70,435 కోట్లు రద్దు చేశారు. ఆ సమయంలోనే ఎన్నికల బాండ్లు భారీగా అమ్ముడు పోవడం గమనార్హం.కేవలం మాఫీ ప్రకటించడమే తప్ప రుణ వసూలు పక్రియ కొనసాగు తూనే ఉంటుందని నమ్మబలికారు. ఐదేళ్లలో ఇటువంటి మాఫీ చేసిన రుణాల్లో రూ.1,32,036 కోట్లు వసూలు చేసినట్లు గొప్పగా చెప్పుకొచ్చారు. అంటే మాఫీ చేసిన మొత్తంలో దాదాపు పదో వంతు మాత్రమే బ్యాంకులకు వసూలయిందన్నమాట. కార్పొరేట్లు తీసుకున్న రూ.4.5 లక్షల కోట్ల బ్యాంకు రుణాల్లో కేవలం రూ. 1.61 లక్షల కోట్లు మాత్రమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో వసూలు చేశారు. అంటే బ్యాంకులు రూ.2.85 లక్షల కోట్లు కోల్పోయాయి. ఇలా బ్యాంకుల సొమ్ము కార్పొరేట్ల పాలు అవుతోంది. మోడీ ప్రభుత్వం వచ్చాక పరోక్ష పన్నులను, సెస్సులను పెంచి జనంపై భారాలు పెంచి, ప్రత్యక్ష పన్నుల్లో కార్పొరేట్లకు వివిధ రూపాల్లో రాయితీలు కల్పిస్తోంది. బడ్జెట్లో దాదాపు 8శాతం కార్పొరేట్ పన్ను రాయితీల ద్వారా వారికి లక్షల కోట్ల రూపాయల లబ్ది చేకూర్చింది. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి వాటిని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ప్రతి ఏటా డిజిన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రజల సొత్తు అప్పనంగా కుబేరులకు అప్పగిస్తున్నారు. గత ఏడాది భారీ ప్రచారంతో తీసుకొచ్చిన మానిటైజేషన్ పైప్ లైన్ పథకం కూడా ఆ కార్పొరేట్లకే లబ్ది చేకూర్చింది. ఇలా అన్ని విధాలుగా సంపన్నులకు ప్రజల సంపదను దోచిపెడుతున్న సర్కారు సామాన్య రైతులు, సాధారణ ప్రజలపట్ల మాత్రం కర్కశంగా వ్యవహరిస్తోంది. కరువు కాటకాల వలన, వరదలు, తుపాను వలన నష్టపోయి లేదా పంటకు న్యాయమైన ధర దక్కక తీవ్రంగా నష్టపోయిన కారణంగా బ్యాంకులో తీసుకున్న రుణం తిరిగి తీర్చలేని రైతుల నుండి మాత్రం ఎటువంటి మినహాయింపు లేకుండా వసూలు చేయాలని బ్యాంకులను సర్కారు ఆదేశిస్తుంది. మధ్యతరగతి ప్రజానీకం తమ గృహ రుణాలు లేదా వినిమయ రుణాలను తీసుకొని కోవిడ్ సమయంలో తిరిగి కిస్తీలు కట్టలేని పరిస్థితిలో వాటిని మాఫీ చేయాలని గగ్గోలు పెట్టినా బ్యాంకుల ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతింటుందనీ, అలా చేయడం సాధ్యం కాదనీ మోడీ సర్కారు సుప్రీం కోర్టులో చెప్పింది. మరి ఈ ఐదేళ్లలోనే పది లక్షల కోట్ల రూపాయలకు పైగా కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఆర్థిక క్రమశిక్షణ ఏమయినట్లో మోడీ సర్కారే చెప్పాలి.

## యువతి కిడ్నాప్‌పై మంత్రి కెటిఆర్ ఆరా

### తక్షణం దుండగులను పట్టుకోవాలని ఆదేశం



**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్20(సమ సమాజం):** చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన యువతి కిడ్నాప్‌పై మంత్రి కేటీఆర్ ఆరా తీసారు. వేములవాడ పర్యటనలో ఉన్న కేటీఆర్.. యువతి కిడ్నాప్ విషయం తెలిసిన వెంటనే రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డేను పిలుచుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో శాంతి భద్రతలపై ఆరా తీశారు. మూడపల్లి యువతి కిడ్నాప్ నిందితులను సాయంత్రంలోపు పట్టుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు దురదృష్టకరమని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ఎవరిని ఉపేక్షించొద్దని కేటీఆర్ ఎస్పీకి సూచించారు. వెంటనే వివరాలు సేకరించాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువతిని మంగళవారం తెల్లవారుజామున అపహరించారు. ఉదయం 5:20 గంటల సమయంలో ఓ నలుగురు యువకులు కారులో వచ్చారు. తన తండ్రితో కలిసి హనుమాన్ ఆలయానికి వెళ్లిన యువతిని బలవంతంగా లాక్కొచ్చి, కారులో ఎక్కించారు. అడ్డుకోబోయిన తండ్రిని తోసేశారు. అనంతరం కారును వేగంగా ముందుకు పోనిచ్చారు. ఈ దృశ్యాలు అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే ఉదయం కిడ్నాప్‌నకు గురైన యువతికి, అదే గ్రామానికి చెందిన కట్కూరి జాన్‌కు గత కొంతకాలం నుంచి పరిచయం ఉంది. అయితే ఏడాది క్రితం జాన్ ఆ యువతిని బయటకు తీసుకెళ్లి, పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆమె మైనర్ కావడంతో.. పోలీసులు జాన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇక రెండు రోజుల క్రితం ఆమెకు మరో వ్యక్తితో నిశ్చితార్థం జరిగినట్లు సమాచారం. దీంతో జానే ఆమెను కిడ్నాప్ చేసి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కెటిఆర్ యువతి కిడ్పాప్ విషయం తెలుసుకుని ఎస్పీతో మాట్లాడారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**ముంబై, డిసెంబర్ 20 (సమ సమాజం):** పెరిగినప్పుడు వేలల్లో..తగ్గినప్పుడు వందల్లో అన్నది బంగారానికి బాగా సరిపోతుంది. గత మూడేళ్లుగా ఇలా ఎంతగా పెరిగిందంటే 50వేలకు తులం చేరేంతగా పెరిగింది. తాజాగా బంగారం ధర కాస్త దిగి వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్ ధరల ప్రభావమో మరోకటో కానీ పసిడి ధర స్వల్పంగా మాత్రమే తగ్గుతోంది. సోమవారం స్థిరంగా ఉన్న బంగారం ధర మంగళవారం మాత్రం కాస్త తగ్గింది. 10 గ్రాముల బంగారంపై రూ.380 వరకు తగ్గింది. 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.350 మేర తగ్గింది. నేడు 22 క్యారెట్ల ధర రూ.49,600కు చేరింది. ఇక 24 క్యారెట్ల బంగారం ధరపై రూ.380 తగ్గి రూ.54,110కి చేరుకుంది. వెండి కిలోపై రూ.200 మేర తగ్గింది. దేశంలో వెండి ధర రూ.69,500కు చేరుకుంది.

## సంక్షేమంలో తెలంగాణ నెంబర్ వన్

### పార్టీలో చేరిన వారికి కండువా కప్పిన ఎమ్మెల్యే



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 20 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందుతున్నాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలతో తెలంగాణ ముందు వరసలో ఉందన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని కే.టి దొడ్డి మండలం కుచినేర్లకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు, వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాలకు పార్టీలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలను అందజేస్తుందని వెల్లడించారు. ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిలా ఆదరిస్తామని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో హరిజన చిన్న హనుమంతు,పెద్ద హనుమంతు, సురేశ్, కురువ దేవేందర్, భీమయ్య నర్సింహులు, సవారప్ప సవారప్ప , చిన్న నర్సింహులుతో పాటు మరో 30 మంది గులాబీ పార్టీలో చేరారు.

## పేదల కోసం కెసిఆర్ రూపంలో దేవుడు వచ్చాడు

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పొగడ్తలు



**హైదరాబాద్, డిసెంబర్ 20 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రంలో పేదలకు సహాయం చేయడానికి దేవుడే సీఎం కేసీఆర్ రూపంలో వచ్చాడని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎర్రమంజిల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్రిస్టియన్ సోదరీమణులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న గిఫ్ట్ పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని పాస్టర్, క్రిస్టియన్ సోదర సోదరీమణులు ప్రార్థనలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో అందించే ప్రతి సంక్షేమ పథకం సీఎం కేసీఆర్ అందిస్తున్నదేనని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. సీఎం ఆదేశాల మేరకు సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే వారధి వలే పని చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి .. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సీఎం కేసీఆర్‌ని కలుస్తున్నారని చెప్పారు. ఎల్.బి. స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు.

## పైరవీలు చేసుకున్న వారికే ప్రాధాన్యం

### దిగ్విజయ్ రాకతో సమస్యలు తెలుస్తాయి
### నల్లగొండలో కోమటిరెడ్డి వ్యాఖ్యలు
### సీనియర్లను పట్టించుకోలేదన్నదే ఆవేదన అన్న భట్టి

**నల్లగొండ, డిసెంబర్ 20 (సమ సమాజం):** హుజూరాబాద్‌లో టీపీసీసీ ఎందుకు ప్రచారం చేయలేదో విచారణ చేయాలని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మునుగోడు సభలో తనను తిట్టడంపై, మార్ఫింగ్ వీడియోలపై విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ లో కార్యకర్త, పీసీసీ చీఫ్ ఇద్దరూ సమానమేనన్నారు. నల్లగొండ జిల్లా కమిటీతో పాటు కొన్ని చోట్ల పీసీసీ కమిటీలో బలమైన నాయకులకు చోటు ఇవ్వలేదని తెలిపారు. 20 నెలల్లో పీసీసీ చీఫ్ జిల్లాలవారీ మీటింగ్‌లు పెట్టలేదన్నారు. నల్లగొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీల్లో.. గాంధీభవన్ లో ఉంటూ పైరవీలు చేసుకునే వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలపై అధ్యయనానికి దిగ్విజయ్ ను నియమించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇప్పటికైనా పార్టీలో మార్పు వస్తుందని ఆశిస్తున్నానని ఆయన తెలిపారు. హుజూరాబాద్ లో రేవంత్ ప్రచారానికి ఎందుకు వెళ్లలేదో విచారణ చేయాలని హైకమాండ్‌ను డిమాండ్ చేశారు. మునుగోడులో తనను బూతులు తిడుతున్న వారిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ కమిటీల్లో తాము ఇచ్చిన పేర్లను పట్టించుకోలేదని వెంకట్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ లో సీనియర్లకు అన్యాయం జరిగిందన్నారు. కాగా, తెలంగాణలో కనీసం మౌలిక సదుపాయాలు లేవని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు.. ఆరోగ్య శ్రీ పనిచేయడం లేదని విమర్శించారు. పక్క రాష్ట్రంలో వైద్యం ఖర్చు వెయ్యి రూపాయలు దాటితే ఆరోగ్య శ్రీ అమలవుతోందని.. మన రాష్ట్రంలో మాత్రం ఆ నిబంధన ఎందుకు అమలుకావడం లేదని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ఇదిలావుంటే వలస నేతలంటే తమకు గౌరవమేనని కాంగ్రెస్ సీనియర్ నేత భట్టి విక్రమార్క అన్నారు. వారిని రాజీనామా చేయాలని ఎప్పుడూ అనలేదన్నారు. మొదటి నుంచి పార్టీకి పనిచేస్తున్నవారికి అవకాశం ఇవ్వాలనే అన్నామని పేర్కొన్నారు. నిన్న మొన్న వచ్చినవారికి జనరల్ సెక్రటరీ పదవులు ఇవ్వడం వల్ల కొందరు మనస్థాపం చెందారని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

# బండి సంజయ్ అసలు మనిషా..పశువా



(మొదటి పేజి తరువాయి) తప్ప ఆయనకు ఏం తెల్వదు. వీళ్లు వచ్చిన తర్వాతే దేవుడికి మొక్కుడు నేర్పించినట్లు వ్యవహరిస్తున్నారు. బండి సంజయ్ నిజంగా రాజన్న భక్తుడు అయితే వేములవాడకు రూ. 100 కోట్లు ఎందుకు తేలేకపోతున్నాడు. మోదీ దగ్గర పలుకుబడి లేదా. అడగడానికి నోరు రాదా. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామికి, కొండగట్టు అంజన్న ఆలయానికి, జోగులాంబ ఆలయానికి, భద్రాద్రి రాముడికి, యాదాద్రికి నిధులు తీసుకురా అని సంజయ్‌కు కేటీఆర్ సవాల్ విసిరారు. వేములవాడ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. మన ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన అభివృద్ధి గురించి చెప్పే శక్తి మన కేడర్‌కు ఉంది. సెస్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. మన సెస్ పరిధిలో 2014 వరకు 44 సబ్ స్టేషన్లు ఉండేవి.. 8 సంవత్సరాల పరిపాలనలో మనం రూ. 51 కోట్లతో 34 కొత్త సబ్ స్టేషన్లను నిర్మించాం. కొత్తగా ఐదు మంజూరు చేసుకున్నామని తెలిపారు. 65 ఏండ్లలో చేసిన అభివృద్ధి మనం 8 ఏండ్లలో చేసి చూపించామన్నారు. మూలవాగుపై రూ. 62 కోట్లతో 13 చెక్ డ్యాంలు నిర్మించామని తెలిపారు. రాజన్న గుడిని అభివృద్ధి చేస్తాం.. అది మా బాధ్యత అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఉత్తర కాశీకి నిధులు ఇచ్చారు. మరి దక్షిణ కాశీ అయిన వేములవాడకు ఎందుకు నిధులు ఇవ్వరు అని ప్రశ్నించారు. బీజేపీకి అబద్ధాలు చెప్పడం మాత్రమే తెలుసన్నారు. పల్లె పలలెనా ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు ఉన్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇవన్నీ ఉన్నాయా? అని అడిగారు. దేశంలో ఉత్తమ 20 గ్రామపంచాయతీల్లో..19 గ్రామపంచాయతీలు మన రాష్ట్రంలో ఉన్నాయని వాళ్లే అవార్డులు ఇచ్చారని గుర్తు చేశారు. వేములవాడను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం. వేములవాడను కూడా సిరిసిల్ల స్థాయిలో అభివృద్ధి చేస్తా.. తనకు ఈ రెండు ఒక్కటే అని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు పొద్దున లేస్తే కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాయి.. వారు శాపనార్థాలు పెడితే.. మీరే కాపాడాలి. మీ ఆశీస్సులు ఉంటే.. కేసీఆర్‌ను ఎవరూ ఏమీ చేయలేరని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అంతకుముందు వేములవాడ నియోజకవర్గ పరిధిలోని రుద్రంగిలో రూ.3 కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మించిన కేజీబీవీని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో సంక్షోభం



(మొదటి పేజి తరువాయి) రాశారు. ఈ క్రమంలోనే సీనియర్లు సమావేశాల మీద సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరిస్థితి విషమిస్తోందని గ్రహించిన అధిష్టానం టీ కాంగ్రెస్‌పై ఫోకస్ పెట్టింది. టీ కాంగ్రెస్‌లో సంక్షోభానికి తెరదించే భాధ్యతను దిగ్విజయ్ సింగ్‌కు అప్పగించినట్టు తెలుస్తోంది. దిగ్విజయ్ సింగ్‌కు టీ కాంగ్రెస్ అడ్వయిజర్ భాధ్యతను అప్పగించినట్టు సమాచారం. త్వరలో టి.కాంగ్రెస్ నేతలతో దిగ్విజయ్ సింగ్ సమావేశ కానున్నట్టు తెలుస్తోంది.

## పోలీస్ పరుగు పందెంలో ఓడిన రాజేందర్

(మొదటి పేజి తరువాయి) అనారోగ్యాలకు ముందుగా వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతుంటాయని పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. మృతుడు రాజేందర్ ఫ్యామిలీ హిస్టరీలో ఉన్న జెనటికల్ ప్రాబ్లమ్ కూడా మరణానికి కారణమై ఉండవచ్చన్నారు. అభ్యర్థుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకొని రిక్రూట్‌మెంట్‌లో చాలా మార్పులు చేశారని తెలిపారు. ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గిన రాజేందర్.. తన కోరిక తీరకుండానే మృతి చెందడం చాలా బాధాకరం అని రంగనాథ్ అన్నారు. 17న 1600మీటర్ల పరుగు పందెంలో పాల్గొని అస్వస్థతకు గురైన రాజేందర్ వరంగల్ కాకతీయ యూనివర్సిటీ గ్రౌండ్ లో జరుగుతున్న కానిస్టేబుల్ ఫిజికల్ టెస్టుల్లో రాజేందర్ పాల్గొన్నాడు. నెల 17వ తేదీన పోలీసు రిక్రూమెంట్ పరుగు పందెంలో 1600 మీటర్ల విభాగంలో పాల్గొని గుండెపోటుతో కుప్పకూలగా.. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. గత నాలుగు రోజులుగా ఐసీయూలో ఉంచి చికిత్స అందించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. రాజేందర్ స్వస్థలం ములుగు జిల్లా శివా తండా. రాజేందర్ ఘటనతో మొత్తం పోలీసు రిక్రూట్ మెంట్ విధానాన్ని మార్పు చేయాలనే డిమాండ్లు పెరిగాయి. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డీజీపీ ఆఫీసు ముట్టడికి ప్రయత్నించగా.. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సైతం స్పందించారు. దేశంలో ఎక్కడా లేనట్లు కఠినంగా వ్యవహరిస్తున్నారని.. లాంగ్ జంప్ డిస్టెన్స్ తగ్గించాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. పోలీసు శాఖ ఉన్నతాధికారులు కూడా స్పందించి మార్పులు చేసినట్లు సీపీ ఏవీ రంగనాథ్ వెల్లడించారు.

## నేటి నుంచే గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్స్

(మొదటి పేజి తరువాయి) వర్చువల్‌గా మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. గర్భిణుల్లో పోషకాహార లోపం నివారణకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయనున్నారు. ప్రాథమికంగా తొమ్మిది జిల్లాల్లో గర్భిణులకు ప్రభుత్వం పంపిణీ చేయనున్నది. న్యూట్రిషన్ కిట్ల కోసం రూ.50కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. మొదట తొమ్మిది జిల్లాల్లో గర్భిణులకు కేసీఆర్ కిట్లను పంపిణీ ప్రభుత్వం పంపిణీ చేయనున్నది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి, ములుగు, భూపాలపల్లి, వికారాబాద్, నాగర్ కర్నూల్, గద్వాల, కొత్తగూడెం జిల్లాల్లో కిట్లు పంపిణీ చేయనున్నారు. ఆయా కార్యక్రమాల్లో గర్భిణుల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు మాతా, శిశు మరణాల నివారణ కోసం ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను ప్రవేశపెట్టింది. ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతో కూడిన న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయనున్నది. 16 నుంచి 24వారాలు ( రెండో త్రైమాసికం), 27 నుంచి 24 వారాలు (మూడో త్రైమాసికం) ఉన్న గర్భిణులు కిట్‌కు అర్హులని అధికారులు పేర్కొన్నారు. ఒక్కో కిట్ రూ.2 వేల వరకు ఉంటుందని చెప్పారు. ఇందులో ఆరకిలో నెయ్యి. కిలో ఖర్జూర పండ్లు, ఒక్కొక్కటి కిలో చొప్పున రెండు హార్లిక్స్ బాటిల్స్, ఇతర పోషక పదార్థాలు ఉండనున్నాయి.

# ఖర్గే వ్యాఖ్యలపై రాజ్యసభలో దుమారం



(మొదటి పేజి తరువాయి) భారతదేశ స్వాతంత్య్రం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రాణ త్యాగాలు చేసిందని, దేశ ఐక్యత కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ తమ ప్రాణాలను అర్పించారని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే వ్యాఖ్యానించారు. బీజేపీకి మాత్రం స్వాతంత్య్ర పోరాటంలో ఎలాంటి పాత్ర లేదని, దేశం కోసం బీజేపీ నేతల ఇళ్లలో కనీసం కుక్క కూడా చావలేదని మల్లిఖార్జున్ ఖర్గే సోమవారం అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా రాజస్థాన్‌లోని అల్వార్‌లో మాట్లాడిన ఖర్గే.. ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, దేశ స్వాతంత్య్ర పోరాటంలోగానీ, ఐక్యతలో గానీ బీజేపీ నేతల పాత్ర ఏముందని ప్రశ్నించారు. దేశం కోసం బీజేపీ నుంచి ఎవరు ప్రాణ త్యాగాలు చేశారని నిలదీశారు. దేశ కోసం పోరాడిన వాళ్లను ఈ మాఫీ మాంగ్‌నే వాలే లోగ్ (బీజేపీ నేతలు) క్షమాపణ కోరడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు.

## విద్వేష మార్కెట్లో ప్రేమను పంచుతున్నా



(మొదటి పేజి తరువాయి) చెప్పారు. విద్వేష రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఒక మార్కెట్‌గా, తన పాదయాత్రను ఆ విద్వేష మార్కెట్‌లో ప్రేమను నింపే ఒక దుకాణంగా పోల్చి సమాధానమిచ్చారు. తాను విద్వేష మార్కెట్‌లో ప్రేమను పంచే ఒక దుకాణం తెరిచానని వ్యాఖ్యానించారు. తాను చేస్తున్న'భారత్ జోడో పాదయాత్ర'పై రాహుల్ గాంధీ మరోసారి స్పష్టత ఇచ్చారు. 'ద్వేషాల మార్కెట్‌లో ప్రేమ దుకాణాన్ని తెరుస్తున్నాను. నా యాత్ర ఎందుకోసం అనే వారికి ఇదే నా సమాధానం' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. పాదయాత్రలో భాగంగా ప్రజలను ఉద్దేశించి పలుచోట్ల రాహుల్ గాంధీ మాట్లాడారు. 'నేను విద్వేషాల మార్కెట్‌లో ప్రేమ దుకాణాన్ని తెరుస్తున్నాను. నేను ఈ యాత్ర ఎందుకు చేస్తున్నాను అని అడిగే బీజేపీ నాయకులకు ఇది నా సమాధానం' అని అన్నారు. భారత్ జోడో యాత్ర100 రోజులు పూర్తి చేసుకుందన్నారు. తమిళనాడులోని కన్యాకుమారి నుంచి కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తర్వాత ఇప్పుడు రాజస్థాన్‌లో కొనసాగుతోందని వివరించారు. నేను వెళ్లే దారిలో ఇతర స్నేహితులను కూడా కలుస్తాను. సాధారణంగా వాళ్లు బీజేపీ కార్యాలయంపైనా నిల్చుంటారు. నేను అటుగా వెళ్తున్నప్పుడు వారికి కూడా నేను నమస్కరిస్తాను. చేతులు ఊపుతూ ద్వేషం యొక్క మార్కెట్‌లో నేను ప్రేమ దుకాణాన్ని తెరుస్తున్నాను. మీరు నన్ను ద్వేషిస్తారు. మీరు నన్ను దుర్భాషలాడుతున్నారు. కానీ.. మీ దుకాణం ద్వేషపూరితమైనది. అయితే.. నా దుకాణం ప్రేమతో కూడుకున్నది. ఇది నా దుకాణం మాత్రమే కాదు. ఇది మొత్తం సంస్థ యొక్క దుకాణం. స్వాతంత్య్ర పోరాట సమయంలో మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, అంబేద్కర్, ఆజాద్ అందరూ విద్వేషాల మార్కెట్‌లో ప్రేమ దుకాణాలు తెరిచారు. నేను కూడా అభ్యర్థిస్తున్నాను. ఎందుకంటే మన మతం.. మన దేశం.. అంతా ప్రేమే తప్ప ద్వేషం కాదని రాహుల్ గాంధీ చెప్పారు. రాజస్థాన్ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ ప్రశంసలు కురిపించారు. దేశంలో పేదల కోసం ఉత్తమమైన పథకాలు రాజస్థాన్‌లో అమలవుతున్నాయని అన్నారు. కర్నాటక, మహారాష్ట్ర రాష్టాల్లో పాదయాత్ర చేసినప్పుడు ప్రజలు తనను కలసి తమకు కిడ్నీ మార్పిడి చేయాల్సి ఉందని.. అయితే తమ వద్ద డబ్బులు లేవని చెప్పారని గుర్తు చేసుకున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలో మాత్రం ఇలా జరగడం లేదని గుర్తించాన న్నారు. రాజస్థాన్ రాష్ట్రంలో చిరంజీవి యోజన పథకం లక్షల మంది హృదయాలలో నుండి భయాన్ని తొలగించిందని ప్రజలు చెప్పారని..అందుకే రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించాల్సిన అవసరం ఉందని అన్నారు. బహుశా ఈ పథకం దేశం మొత్తానికి కొత్త మార్గం చూపుతుందని రాహుల్ గాంధీ అన్నారు. గత సెప్టెంబరు 7వ తేదీన తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభమైన యాత్ర కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మీదుగా ఇప్పుడు రాజస్థాన్‌లో కొనసాగుతోంది. ఎనిమిది రాష్టాల్లో శుక్రవారంతో 100 రోజులు పూర్తి చేసుకున్న భారత్ జోడో యాత్ర ఈనెల 24వ తేదీన ఢిల్లీలో ప్రవేశించనుంది. ఎనిమిది రోజుల విరామం తర్వాత ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, చివరగా జమ్మూ కాశ్మీర్‌లో జరగనుంది.

# సిఎం కెసిఆర్‌తో పంజాబి సిఎం మాన్ భేటీ



(మొదటి పేజి తరువాయి) కేసీఆర్‌తో సమావేశమవుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న రైతు వ్యతిరేక నిర్ణయాలు, ఇతర అంశాలపై చర్చిస్తున్నారు. బీజేపీపై పోరాటం విషయంలో కేసీఆర్‌కు పలువురు నేతలు మద్దతు తెలుపుతున్నారు. పంజాబ్ శాసనసభ స్పీకర్ సర్దార్ కుల్తార్‌సింగ్ సంధ్వాన్ ఈ నెల 24న తెలంగాణకు రానున్నారు.

ఆయనతోపాటు డిప్యూటీ స్పీకర్ జైకిషన్ సింగ్ రౌరీ, రాజ్యసభ సభ్యుడు విక్రమ్‌జీత్ సింగ్ సాహ్ని, ఎమ్మెల్యే కుల్వంత్ సింగ్ పండోరి, మరో ఇద్దరు కూడా హైదరాబాద్‌కు రానున్నారు.

# ఉప్పల్‌లో మేయర్ విజయలక్ష్మికి చేదు అనుభవం

### కార్యకర్తల ఆందోళనతో వెనుదిరిగిన మేయర్




హైదరాబాద్, డిసెంబర్ 20 (సమ సమాజం): ఉప్పల్‌లో మేయర్ విజయలక్ష్మికి చేదు అనుభవం ఎదురైంది. మేయర్ ప్రొటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. స్థానిక ఎమ్మెల్యే లేకుండా ఎలా శంకుస్థాపనలు చేస్తారంటూ నిరసన వ్యక్తం చేశారు. మేయర్ విజయలక్ష్మితో ఉప్పల్ బీఆర్ఎస్ నేతలు వాగ్వాదానికి దిగారు. చిలుకానగర్‌లో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు వచ్చిన విజయలక్ష్మితో పెద్ద ఎత్తున గొడవకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు గొడవకు దిగారు. జీహెచ్ఎంసీ నిధులతో చేస్తున్న కార్యక్రమాలకు ఎమ్మెల్యేని పిలవాల్సిన అవసరం లేదంటూ విజయలక్ష్మి సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్‌తో తనకు సంబంధం లేదని, అది అధికారుల పని అంటూ మేయర్ విజయలక్ష్మి వెనుదిరిగారు.

# వారం ముందే ముగియనున్న పార్లమెంట్?

న్యూఢిల్లీ, డిసెంబర్ 20 (సమ సమాజం): పార్లమెంట్ శీతాకాల సమావేశాలు షెడ్యూల్ కంటే ముందే ముగియ నున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7న ప్రారంభమైన పార్లమెంట్ వింటర్ సెషన్ ఈ నెల 29 వరకు కొనసాగాల్సి ఉండగా.. ఆరు రోజులు ముందుగానే అంటే ఈ నెల 23న ముగియనుంది. డిసెంబర్ 23న పార్లమెంట్ ఉభయసభలు నిరవధిక వాయిదా పడనున్నాయి. లోక్‌సభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. లోక్‌సభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అయితే, దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# పార్లమెంట్ ఆవరణలో మిల్లెట్ ఓన్లీ లంచ్



(మొదటి పేజి తరువాయి) మిల్లెట్లతో తయారైన ప్రత్యేక వంటకాలను వడ్డించారు. '2023ని అంతర్జాతీయ మిల్లెట్ల సంవత్సరంగా గుర్తించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పార్లమెంటులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరయ్యాను. మిల్లెట్ వంటకాలు వడ్డించారు. అన్ని పార్టీల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరం' అని ప్రధాని నరేంద్ర మోడీ ట్వీట్ చేశారు. 2023ను అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఈ క్రమంలో వీటి ప్రాధాన్యతను చాటిచెప్పడం, మి÷-లలెట్లకు ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర తోమర్, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కర్ తో పాటు ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గేలు ఒకే టేబుల్ పై కూర్చొని భోజనం చేశారు.

## చైనాతో సరిహద్దుల్లో గట్టి నిఘా

(మొదటి పేజి తరువాయి) పరీక్షించారు. అప్పటి నుంచి భారత సైన్యం తన అమ్ములపొదిలో చేర్చుకునేందుకు ఆర్మీ ఎదురుచూస్తున్నది. భారత్-చైనా సరిహద్దుల్లో ప్రళయ్ క్షిపణిని మోహరించే పక్రియ ప్రారంభమైంది. వచ్చే వారం జరగనున్న ఉన్నత స్థాయి సమావేశంలో దీనికి ఆమోదం లభించే అవకాశం ఉన్నది. మన త్రివిధ దళాలు ప్రస్తుతం రాకెట్ ఫోర్స్‌ను తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ పరిస్థితిలో ప్రళయ్ క్షిపణిని సరిహద్దులో మోహరించడం త్వరలోనే సాధ్యం కానున్నది. ఈ రాకెట్ ఫోర్స్ నిర్మాణంలో దివంగత జనరల్ బిపిన్ రావత్ ఎంతో కృషి చేశారని నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్కే హరి కుమార్ చెప్పారు. సరిహద్దులో శత్రువులను ఎదుర్కోవడంలో ఈ రాకెట్ ఫోర్స్ ప్రత్యేకత కలిగి ఉంటుంది. ప్రళయ్ క్షిపణిలో సాలిడ్ ప్రొపె÷-లలెంట్ రాకెట్ మోటారు అమర్చబడి ఉంటుంది. క్షిపణి మార్గదర్శక వ్యవస్థలో అత్యాధునిక నావిగేషన్, ఇంటిగ్రేటెడ్ ఏవియానిక్స్ ఉన్నాయి. ప్రళయ్ క్షిపణి 1000 కిలోల బరువున్న పేలుడు పదార్థాన్ని మోసుకెళ్లగలదు. ఇంటర్‌సెప్టర్ క్షిపణులను ఛేదించగలిగే విధంగా ఈ క్షిపణిని అభివృద్ధి చేసినట్లు డీఆర్‌డీఓ వర్గాలు చెప్తున్నాయి. హోలోకాస్ట్ వేగాన్ని డీఆర్‌డీఓ ఇంకా వెల్లడించనప్పటికీ, ఈ క్షిపణి రాత్రి పూట కూడా శత్రువులను లక్ష్యంగా చేసుకుంటుందని మీడియా కథనాలు చెప్తున్నాయి.

# గ్రామీణాభివృద్ధితో పల్లెలు కళకళ

### మంత్రి సత్యవతి రాథోడ్



వరంగల్, డిసెంబర్ 20 (సమ సమాజం): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని రాష్ట్ర మహిళ,శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్లలెల్లో మౌలిక వసతులు పెరిగాయని అన్నారు. జిల్లాలోని గీసుగొండ మండలం కొనాయిమాకుల గ్రామంలో రూ.87.45 లక్షల వ్యయంతో బాలసదనం భవన నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. జిల్లా గ్రామీణాభి వృద్ధి, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆధునిక వ్యవసాయ పనిముట్ల అ÷-దదె కేంద్రం, రూ.7.71 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఆమె లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో పల్లెలు కళకళలాడుతు న్నాయని అన్నారు. గ్రామీణ రోడ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, జిల్లా కలెక్టర్ బీ.గోపి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు




# చలన చిత్రం

## కనెక్ట్ సినిమాకు నిడివి గండం

**కేవలం 90 నిముషాల కారణంగా విడుదలపై సందిగ్ధం**




లేడీ సూపర్ స్టార్ నయనతార గత కొంత కాలంగా కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాకే ప్రాధాన్యతనిస్తూ వస్తోంది. సరికొత్త కథ కథనాలతో రూపొందుతున్న సినిమాల్లో నటిస్తూ తనదైన ప్రత్యేకతని చాటుకుంటోంది. నటించిన లేటెస్ట్ హారర్ థ్రిల్లర్ 'కనెక్ట్'. అశ్విన్ శరవణన్ ఈ మూవీకి దర్శకత్వం వహించాడు. రౌడీ పిక్చర్స్ బ్యానర్ పై నయనతార భర్త దర్శకుడు విఘ్నేష్ శివన్ ఈ హారర్ థ్రిల్లర్ ని నిర్మించాడు. బాలీవుడ్ ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ అనుపమ్ ఖేర్ సత్యరాజ్ వినయ్ రాయ్ హనీయా నఫీజ్ కీలక పాత్రల్లో నటించారు. ఈనెల 22న ఈ మూవీని తమిళ తెలుగు భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. హాలీవుడ్ సినిమాల ఫార్మాట్ లో ఈ మూవీ నిడివిని కేవలం 90 నిమిషాలకు కుదించారు.అంతే కాకుండా నిడివి తగ్గడంతో సినిమాకు ఇంటర్వెల్ లేకుండా కంటిన్యూగా ఎండ్ వరకు ప్రదర్శించబోతున్నారు. ఇదే ఇప్పుడు నయనతార సినిమాకు పెద్ద ఇబ్బందికరంగా మారినట్టుగా తెలుస్తోంది. హాలీవుడ్ సినిమాలు 3 గంటలకు నిడివికి పైనే వుంటున్న ఈ రోజుల్లో నయన సినిమా కేవలం గంటా 30 నిమిషాలే వుండటం గమనార్హం. ఇదే ఇప్పుడు తమిళనాట ఈ మూవీకి పెద్ద ఇబ్బందికరంగా మారినట్టుగా తెలుస్తోంది. నిడివి కారణంగా అసలు విరామమే లేకుండా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ మూవీకి ఎగ్జిబిటర్లు సపాక్ ఇచ్చినట్టుగా చెబుతున్నారు. తమిళనాడులోని థియేటర్ల యజమానులు ఈ మూవీని ప్రదర్శించడానికి ముందుకు రాకపోవడం పలువురిని షాక్ కు గురిచేస్తోంది. తమిళనాట లేడీ సూపర్ స్టార్ అనిపించుకుంటున్న నయనతార సినిమాకు ఇలాంటి పరిస్థితి ఏంటని అంతా అవాక్కవుతున్నారు. ప్రతీ సినిమాకు ఇంటర్వెల్ వుంటేనే థియేటర్ సిబ్బందికి ఎంతో కొంత ఆదాయం వుంటుంది. ఇంటర్వెల్ సమయంలో అమ్మే కూల్ డ్రింక్స్ చిరు తిళ్లకు ఈ సినిమా గండి కొట్టేలా వుందని పలువురు థియేర్స్ ఓనర్స్ చిత్ర బృందానికి తెలిపినట్టుగా చెబుతున్నారు. ఈ విషయంలో పునరాలోచించుకుని ఇంటర్వెల్ వుండేలా ఎ÷-లాన్ చేయాలని మేకర్స్ తో చర్చిస్తున్నారట. ఇదిలా వుంటే తెలుగులో ఈ మూవీకి పెద్దగా బజ్ లేకపోయినా థియేటర్ల నుంచి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. ఈ నేపథ్యంలో ఈ మూవీతో పాటు డిసెంబర్ 23న రవితేజ 'ధమాకా' రిలీజ్ అవుతోంది. ఈ మూవీకి భారీ స్థాయిలో బజ్ క్రియేట్ అయింది. ఇక విశాల్ నటించిన 'లాఠీ'కి కూడా తమిళ తెలుగు భాషల్లో మంచి బజ్ వుంది. అలాగే హీరో నిఖిల్ తో గీతా ఆర్ట్స్ 2 సుకుమార్ వైట్రింగ్స్ నిర్మిస్తున్న '18 పేజెస్' మూవీకి కూడా భారీ క్రేజ్ వుంది. ఈ మూవీ డిసెంబర్ 23న రిలీజ్ కాబోతోంది. అయితే నయనతార 'కనెక్ట్' సినిమాకు థియేటర్స్ లేవు.. బజ్ అంతగా లేకపోవడం గమనార్హం.




## వినరో భాగ్యం విష్ణు కథ.. అంటున్న కిరణ్ అబ్బవరం

హిట్లు, ఫ్లాప్‌లతో సంబంధంలేకుండా వరుసగా సినిమాలు చేస్తున్నాడు కిరణ్ అబ్బవరం. రాజావారు, ఎస్.ఆర్ కళ్యాణ మండపం వంటి బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మంచి దూకుడు చూపించిన కిరణ్.. ఆ తర్వాత వరుస ఫేయిల్యూర్‌తో కాస్త స్లో అయ్యాడు. ఫలితం ఎలా ఉన్నా ఆయన మాత్రం వరుసగా సినిమాలను సెట్స్ మీదకు తీసుకెళ్తున్నాడు. ప్రస్తుతం ఈయన చేతిలో మూడు సినిమాలున్నాయి. అందులో వినరో భాగ్యము విష్ణు కథ ఒకటి. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. మహాశివరాత్రి కానుకగా ఫిబ్రవర్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. చిత్రయూనిట్ ఇప్పటి నుండి ప్రమోషన్‌లు ప్రారంభించింది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ప్రకటించింది. వాసవ సుహాస అంటూ సాగే డివోషనల్ సాంగ్‌ను డిసెంబర్ 24న రిలీజ్‌చేయనున్నట్లు ప్రకటించారు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో కిరణ్‌కు జోడీగా కశ్మీరా పరదేశి హీరోయిన్‌గా నటిస్తుంది. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్-2 బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మాతగా వ్యవహరిస్తున్నాడు. చైతన్య భరద్వాజ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి డానియెల్ విశ్వాస్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు.

## రంగస్థలం ఛాన్స్ మిస్సయిన అనుపమ పరమేశ్వరన్



తినే ప్రతి బియ్యపుగింజ మీద మన పేరు రాసుండాలి అని సాధారణంగా
అంటుంటారు. అదే విధంగా సినిమా రంగంలో నటీనటుల దగ్గరికి వచ్చే కథలపై
వారి పేరు రాసిపెట్టుండాలి అంటారు. ఒకరితో అనుకున్న కథ మరొకరి చెంతకు
వెళ్తుంది. సినిమా పోతే అబ్బ చేయకపోవడమే మంచిదైంది అని అనుకుంటారు.
ఒక వేళ బ్లాక్‌బస్టర్ హిట్టయితే, వాళ్ళ బాధ అంతా ఇంతా కాదు. ఇక ఇప్పుడు అదే
విషయం అనుపమ పరమేశ్వరన్ విషయంలో జరిగింది. ప్రస్తుతం అనుపమ
నటించిన '18పేజీస్' రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్
వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. కాగా ఈ వేడుకలో దర్శకుడు
సుకుమార్ అనుపమ గురించి ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పాడు. అనుపమ
మంచి నటి, తనకు తెలుగు కూడా బాగా వచ్చు. ఇది అనుపమకు ఉన్న మరో
అదనపు క్వాలిటీ అన్నాడు. అంతేకాకుండా 'రంగస్థలం' సినిమాలో సమంత
కంటే ముందు అనుపమనే అనుకున్నారట. ఆడిషన్ కూడా చేశారట. కానీ
ఆడిషన్ టైమ్‌లో అనుపమ భయంతో వాళ్ళ అమ్మ వైపు చూసింది. అందుకే
నాకు భయమేసి సమంతను పెట్టుకున్నా అని చెప్పాడు. ఇక రామలక్ష్మిగా
సమంత నటనకు గొప్ప ప్రశంసలు దక్కాయి. ఇప్పటికీ ఆ సినిమాను మిస్
చేసుకున్నందుకు బాధగా ఉంటుందని అనుపమ చెప్పింది. ఒకవేళ
రంగస్థలం మూవీ అనుపమ చేసుంటే ఆమె కెరీర్ పీక్‌లో ఉండేది. స్టార్ హీరోలతో సినిమాలు
చేస్తూ బిజీ బిజీగా గడపుతుండేది. ప్రస్తుతం ఈ అమ్మడుకి కేవలం మీడియం రేంజ్ సినిమాల ఆఫర్స్ మాత్రమే వస్తున్నాయి.

## రీరిలీజ్ కాబోతున్న పవన్ ఖుషీ



పవన్ కళ్యాణ్ అభిమానులకు న్యూ ఇయర్ గిఫ్ట్ అందనుంది. 2001లో రిలీజ్ అయిన ఖుషి సినిమా అప్పట్లో రికార్డ్ కలెక్షన్స్ సృష్టించింది. అయితే, అభిమానుల కోరిక మేరకు ఈ సినిమాను మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను డిసెంబర్ 31న రీ రిలీజ్ చేయబోతున్నట్లు ఆ చిత్ర బృందం ప్రకటించింది. రీ రిలీజ్ ట్రెండ్ లో భాగంగా ఇప్పటికే పలువురు హీరోల సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయి మళ్లీ రికార్డుల వర్షం కురిపిస్తున్నాయి. అయితే, 21 సంవత్సరాల తర్వాత రిలీజ్ కాబోతున్న పవన్ సూపర్ హిట్ సినిమాపై భారీ అంచనాలు వెలువడుతున్నాయి. మరొకసారి భారీ కలెక్షన్స్ రాబడుతుందని అంచనాలు వినిపిస్తున్నాయి. ఎస్ జే సూర్య దర్శకత్వంలో పవన్ కళ్యాన్, భూమికతో తెరకెక్కిన ఈ లవ్ స్టోరీకి మణిశర్మ సంగీతం అందించారు. ఈ మూవీ 4కే రిజల్యూషన్, డాల్బీ ఆడియోతో రాబోతుంది. ఈ వార్తతో పవన్ అభిమానుల్లో ఖుషీగా ఫీలవుతున్నారు.



**ఓటిటిలోకి రానున్న ఇట్లు మారేడు మిల్లి ప్రజానీకం**

ఎక్కువగా కామెడీ సినిమాలతో అలరించిన 'అల్లరి' నరేశ్ తన రూటు మార్చి.. ప్రస్తుతం వరుసగా సిరీయస్ కథలతో ప్రేక్షకులను పలకరిస్తున్నాడు. గతేడాది 'నాంది' అనే సిరీయస్ కథతో సూపర్‌హిట్ కొట్టిన ఈ నటుడు ఇటీవలే 'ఇట్లు మారేడు మిల్లి ప్రజానీకం' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆనంది, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం సోషల్ థ్రిల్లర్ డ్రామాగా తెరకెక్కింది. ఈ ఏడాది నవంబర్ 25 విడుదలైన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్‌ని సొంతం చేసుకుంది. పలువురు విమర్శకుల నుంచి మంచి చిత్రంగా ప్రశంసలు అందుకుంది. వసూళ్ల పరంగా కూడా బాక్సాఫీస్ వద్ద డీసెంట్ కలెక్షన్లనే అందుకుంది. పలు కారణాలతో థియేటర్‌లో ఈ చిత్రాన్ని చూడలేకపోయిన సినీ లవర్స్ కోసం త్వరలోనే త్వరలో ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 23న ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 లో విడుదలకు సిద్ధమవుతోంది. నూతన దర్శకుడు ఏ.ఆర్. మోహన్ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని.. జీ స్టూడియోస్, హాస్య మూవీస్ సంయుక్తంగా నిర్మించాయి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in